నమ్మించి మోసం చేస్తారా..?



అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పడంతో మేమంతా టీడీపీకి ఓట్లు వేశాం. తల్లికి వందనం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు సదుపాయం వంటి పథకాలు అమలవుతాయని అంతా ఆశించాం. అయితే ఆయా పథకాల అమలుపై కూటమి ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోంది. ఒక్కో పథకాన్ని ఎత్తేసే దిశగా ఆ పార్టీ అడుగులు వేస్తోంది. తల్లికి వందనం, 3 గ్యాస్ సిలండర్లు అమలు చేయకుండా మోసం చేయాలని చూస్తోంది.

– పి.సత్యకళ, ఎంవీపీ కాలనీ

తల్లికి వందనం అమలు చేయాల్సిందే?



బడులు ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా.. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం అమలు చేయడం లేదు. మేనిఫెస్టోలో ఇంట్లో ఎంతమంది పిల్లలు చదివితే అంత మందికీ తల్లికి వందనం పేరుతో రూ.15 వేలు ఇస్తామని చెప్పి కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టింది. అయితే ఈ పథకం అమలుపై మార్గదర్శకాల జారీకి సంబంధించి ఆందోళనకరంగా ఉన్నాయి. నిబంధనల పేరుతో ఈ ప్రభుత్వం ప్రజలను మోసం చేయాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో సూపర్ సిక్స్ పథకాల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా పిల్లలందరికీ తల్లికి వందనం అమలు చేయాల్సిందే.

– డి.వెంకటలక్ష్మి, ఆదర్శనగర్

సూపర్ సిక్స్‌ను కొండెక్కిస్తున్నారు..



అధికారంలోకి వస్తే సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ప్రస్తుతం వాటిని కొండెక్కించే విధంగా కూటమి ప్రభుత్వం పథక రచన చేస్తోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉందని చెప్పి ప్రజలను మోసం చేయాలని చూస్తోంది. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబుకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎన్నికల సమయంలో తెలియదా? అని ప్రశ్నిస్తున్నాం. ఆర్థిక పరిస్థితి బాగోకపోయినా, కోవిడ్ కుంగదీసినా మాజీ సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాటకు అనుగుణంగా నవరత్న పథకాలను అమలు చేసి చూపించారు. అదే మాదిరిగా కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సూపర్‌సిక్స్ పథకాలన్నీ అమలు చేసి చూపించాలనే డిమాండ్ చేస్తున్నాం. లేకుంటే సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజలను మరోసారి వంచించినట్లే అవుతుంది.

– పి.సత్యవతి, ఆదర్శనగర్

నిరుద్యోగ భృతి లేదా?



కూటమి అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3,000 ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అధికారం చేపట్టి 100 రోజులు కావస్తోంది. దీనిపై ఇంత వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. నిరుద్యోగ భృతి ఇస్తారని ఎంతో ఆశతో ఉన్నాం. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇస్తే ఈ పాటికి ఒక నెలైనా రూ.3,000 అందుకునేవాళ్లం. ప్రభుత్వం వెంటనే నిరుద్యోగ భృతి అమలు చేయాలి.


– ఐ.దివాకర్, టీఐసీ పాయింట్, ఆరిలోవ

పిల్లలకు రూ.15 వేలు ఏది?



మా పిల్లలు తోటగరువు జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్నారు. ఇంట్లో చదువుతున్న పిల్లలందరికీ తల్లికి వందనం పేరిట ఏడాదికి రూ.15,000 చొప్పున ఇస్తామన్నారు. ఇప్పటికీ ఎటువంటి మార్గదర్శకాలు జారీ చేయలేదు. ఎప్పుడు ఇస్తారో ఎవరిని అడిగినా తెలియదని అంటున్నారు. అసలు ఈ ఏడాది ఉన్నట్టా? లేదా?

– ఆర్.సత్యవతి, ఆరిలోవ



చంద్రబాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

నమ్మి ఓట్లేశాం... నట్టేట ముంచొద్దు బాబూ...

హామీలన్నీ అమలు చేయండి

నీకు రూ.15 వేలు... నీకు రూ.15 వేలు.. నీకు.. నీకు... ఇంట్లో ఎందరు పిల్లలు చదివితే అందరికీ తల్లికి వందనం పేరుతో రూ.15 వేలు చొప్పున అందజేస్తాం.. మీ అమ్మకు నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు బ్యాంకు ఖాతాలోనే వేసేస్తాం... మీ ఇంటికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చేస్తాం... మీ ఇంటిలోని మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం... మీ ఇంటిలో చదువుకున్న నిరుద్యోగులుంటే ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి చెల్లిస్తాం... రైతులందరికీ అన్నదాత సుఖీభవ పేరుతో ఏడాదికి రూ.20 వేల చొప్పున అందిస్తాం.. అధికారంలోకి రాగానే ఈ సూపర్ సిక్స్ పథకాలన్నీ పక్కాగా అమలు చేసేస్తాం అంటూ ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రచారంలో ఊదరగొట్టారు.. కూటమి నేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌తో సహా స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు మాయా మేనిఫెస్టోను ప్రజలకు చూపించి ఓట్లు అభ్యర్థించారు.. ఆ హామీలన్నీ జనం నమ్మి ఓట్లేసి అధికారం కట్టబెట్టేసరికి... పథకాలు అమలు చేయాలంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదని చేతులెత్తేస్తుండటం గమనార్హం.. స్కూళ్లు తెరవడంతో రూ.15 వేల సాయం కోసం తల్లులు ఆశగా ఎదురు చూస్తున్నా... అందించే నాథుడు కనుచూపు మేరలో కనిపించడం లేదు... గత ఐదేళ్లలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీలన్నీ పక్కాగా అమలు చేశారని... ఆర్థికంగా అండగా నిలిచారని లబ్ధిదారులు గుర్తు చేసుకుంటున్నారు. చంద్రబాబు మాత్రం అందుకు పూర్తి భిన్నమని... బాబు ష్యూరిటీ ఇస్తే... గ్యారంటీ లేదని.. నమ్మిన జనాన్ని మోసం చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్యని విశాఖ తూర్పు నియోజకవర్గ ప్రజలు అంటున్నారు.

– ఆరిలోవ/ఎంవీపీ కాలనీ/మద్దిలపాలెం

ప్రతి మహిళకు నెలకు రూ.1500




నియోజకవర్గంలో 18 ఏళ్లు నిండిన మహిళలు సుమారు **1,00,000**
అందరికీ నెలకు అందించాల్సింది **రూ.15 కోట్లు**

యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి



అర్హులైన నిరుద్యోగులు **50,000**
నెలకు అందించాల్సిన నిరుద్యోగ భృతి **రూ.15 కోట్లు**

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం



ఉచిత బస్సు ప్రయాణానికి అర్హులు **1.50 లక్షల మంది**

ప్రతి తల్లికి రూ.15 వేలు తల్లికి వందనం



పిల్లలను స్కూళ్లకు పంపిస్తున్న తల్లులు **55,000**
అందించాల్సిన 'తల్లికి వందనం' సాయం **రూ.82.50 కోట్లు**

ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు



మొత్తం లబ్ధిదారులు **70,000**
ఏడాదికి ఇవ్వాల్సిన గ్యాస్ సిలిండర్లు **2,10,000**
ఏడాదికి ఇవ్వాల్సిన సాయం **రూ.17.03 కోట్లు**

మహిళలకు నెలకు రూ.1,500 ఇవ్వాలి



సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ఇంట్లో ఉన్న మహిళలకు ప్రతి నెలా రూ.1500 చొప్పున ఇస్తామన్నారు. మాలాంటి పేదలకు ఇలాంటి సాయం ఆసరాగా నిలుస్తుందని ఆశపడ్డాం. అయితే ఈ సాయం ఎప్పటి నుంచి ఇస్తారో స్పష్టత లేదు. వెంటనే పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చి రూ.1500 మంజూరు చేయాలి.

– కె.ఝాన్సీ, ఆరిలోవ కాలనీ

నిరుద్యోగుల ఆశలపై నీళ్లు



ఎన్నికల్లో గెలుపు కోసం కూటమి నాయకులు ఆర్భాటంగా ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల్లో నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు ఇస్తామని ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చి 100 రోజులు కావస్తున్నా.. ఆ ఊసే లేదు. ఆ దిశగా ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లుతున్నారు. మరోవైపు ఉద్యోగ ప్రకటనలు లేవు. నిరుద్యోగ భృతి ప్రకటించి, వెంటనే చెల్లించండి. మాట తప్పకుండా రూ.3 వేలు ఇవ్వండి. ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలి.

– బి.జోగారావు, భానునగర్

ఎప్పటి నుంచి ఉచిత బస్సు ప్రయాణం?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం సదుపాయం కల్పిస్తామని ఊదరగొట్టారు. ప్రభుత్వం ఏర్పాటై మూడు నెలలు దాటినా.. ఇంతవరకు ఉచిత బస్సు ప్రయాణం అవకాశం కల్పించలేదు. ఎప్పటి నుంచి అమలు చేస్తారో ఇప్పటికీ చెప్పలేదు. వెంటనే ఉచిత బస్సు ప్రయాణం సదుపాయం కల్పించాలి.

– పద్మావతి, అంబేడ్కర్ నగర్, ఆరిలోవ

పోషకాహారంతో పీసీవోఎస్ సమస్య దూరం

బీచ్‌రోడ్డు: దేశంలో చాలా మంది మహిళలను ప్రభావితం చేసే పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పీసీవోఎస్) గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి సెప్టెంబర్‌లో పీసీవోఎస్ అవేర్‌నెస్ మాసం జరుపుకుంటారని న్యూట్రిషనిస్ట్ వెల్నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణమూర్తి అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం నిర్వహించిన పీసీవోఎస్ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పీరియడ్స్ సరిగా రాకపోవడం, మగ హార్మోన్ల స్థాయి అధికంగా ఉండటం, అండాశయంలో తిత్తులు వంటి లక్షణాలతో కూడిన పీసీవోఎస్ కారణంగా బరువు పెరగడం, మొటిమలు, అవాంఛిత రోమాలు సంతానోత్పత్తి సమస్యలు వంటి లక్షణాలకు దారి తీస్తుందన్నారు. బాదం, ఆకుకూరలు, పప్పులు, తృణధాన్యాలు వంటి పోషకాహార పదార్థాలను ప్రతి రోజూ తీసుకోవడం చాలా ఉత్తమమన్నారు.

రహదారుల మరమ్మతులకు రూ.16 లక్షలు

సాక్షి ఎఫెక్ట్..

మద్దిలపాలెం: రహదారుల మరమ్మతులకు అధికారులు సమయాత్తమయ్యారు. వెంకోజీపాలెం నుంచి అక్కయ్యపాలెం వరకు గల జాతీయ రహదారికి ఇరువైపులా 400 గోతులు కనుగొన్నారు. కాలనీల్లోని రోడ్లపై మరో 265 గుంతలను గుర్తించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు దెబ్బతిని, వాహన చోదకులు పడుతున్న అవస్థలపై ఈ నెల 14న 'రహదారులు ఛిద్రం' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. వీటిని మరమ్మతులు చేసేందుకు జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగానికి రూ.16 లక్షలు మంజూరు చేశారు. దీంతో ఆయా రోడ్ల మరమ్మతులు చకచకా చేపడుతున్నారు. జోన్-3 డీఈఈ ఎం.శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఈ పనులు జరుగుతున్నాయి.

పనులు ప్రారంభించాం

ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు పాడయ్యాయని డీఈఈ శ్రీనివాసరావు తెలిపారు. వెంకోజీపాలెం నుంచి అక్కయ్యపాలెం వరకు ప్రధాన రహదారిపై పెద్ద గోతులు ఏర్పడ్డాయని, వీటికి మరమ్మతులు చేపడుతున్నామన్నారు. ముందుగా అక్కయ్యపాలెం నుంచి వెంకోజీపాలెం వరకు పనులు ప్రారంభించామన్నారు. తర్వాత వెంకోజీపాలెం నుంచి అక్కయ్యపాలెం వరకు మరమ్మతులు చేస్తామన్నారు. రోడ్లు బాగా దెబ్బతిన్న చోట్ల తారు వేస్తున్నామన్నారు. ఈ పనుల అనంతరం కాలనీల్లోని రోడ్లకు మరమ్మతులు చేపడతామని చెప్పారు.



ఇసుకతోట రోడ్డుపై గోతులకు ప్యాచ్ వర్క్

వినాయక లడ్డూ @ రూ.1.35 లక్షలు

ఎంవీపీకాలనీ: విశాఖ రియల్ ఎస్టేట్ మెంబర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ టీటీడీ సర్కిల్‌లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం గణనాథుడి నిమజ్జనం కనుల పండువగా చేపట్టారు. ఈ సందర్భంగా వినాయక లడ్డూ ప్రసాదం వేలం పాట నిర్వహించగా.. ఎ.సునీల్‌కుమార్, ఎం.సూర్యలు రూ.1.35 లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాంబాబురెడ్డి, ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

మహా అన్నదానం

బీచ్‌రోడ్డు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా 22వ వార్డు శివాజీపాలెంలో గణేష్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం మహా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ ప్రారంభించారు. కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జ్వర పీడితులతో ఆస్పత్రులు కిటకిట



ఆరిలోవ జీవీఎంసీ ఆస్పత్రిలో జ్వర పీడితులు



రోగులతో నిండిన విమ్స్ ఓపీ విభాగం

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలోని ఆస్పత్రులు జ్వర వ్యాధిగ్రస్తులతో నిండిపోతున్నాయి. కొద్ది రోజులుగా జ్వరాలు పెరిగిపోయాయి. పిల్లలు, పెద్దలు తేడా లేకుండా అందరినీ పీడిస్తున్నాయి. విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)తో పాటు ఆరిలోవ జీవీఎంసీ ఫస్ట్ రిఫరల్ యూనిట్ ఆస్పత్రి(ఎఫ్ఆర్‌యూ), శ్రీకృష్ణాపురం, ఆరిలోవ కాలనీ, బాలాజీనగర్ ప్రాంతాల్లోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను కొద్ది రోజులుగా జ్వరాలతో బాధపడుతున్న వారంతా ఆశ్రయిస్తున్నారు. వీటితోపాటు ప్రైవేట్ ఆస్పత్రులు కూడా కిటకిటలాడుతున్నాయి. విమ్స్‌లో బుధవారం వైద్యుల కోసం పేర్లు నమోదు చేసుకోవడానికి అధిక సంఖ్యలో వెళ్లిన జ్వర పీడితులతో ఓపీ రద్దీగా మారింది. ఆరిలోవ ఎఫ్ఆర్‌యూ, ఆరోగ్య కేంద్రాల్లోనూ అదే తీరు. ఈ ప్రాంతంలో దోమలు విపరీతంగా పెరగడంతో జ్వరాలు బారిన పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు.

వైభవంగా చండీ సుదర్శన యాగం

ఆరిలోవ: తోటగరువు వద్ద ఎర్నిదుర్గమాంబ ఆలయ ప్రాంగణంలో బుధవారం చండీ సహిత సుదర్శన యాగం వైభవంగా ప్రారంభమైంది. అర్చకులు, భక్తులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. లోక కల్యాణం కోసం బాలభాను అర్చక, పురోహిత సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ యాగంలో రేజేటి శ్రీరామాచార్యులు, స్మార్త ఆగమ పండితుడు సుసరాపు చంద్రశేఖర శర్మ, జోష్యుల గోపాల శర్మ ఆధ్వర్యంలో విశ్వక్సేన పూజ జరిపారు. అనంతరం భక్తులతో రుద్రాభిషేకం, కుంకుమ పూజలు చేయించారు. సాయంత్రం సీతారామ కల్యాణ ఉత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కనులారా తిలకించారు. అర్చకుల వేద మంత్రాలతో ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో బాలభాను అర్చక, పురోహిత సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



యాగంలో ఉపన్యసిస్తున్న రేజేటి శ్రీరామాచార్యులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక సీమంతాలు

ఆరిలోవ: అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ మా కార్యక్రమాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా అర్బన్ ప్రాజెక్ట్ సీడీపీవో ఆదేశాలతో సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో బుధవారం చినగదిలి సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఆరిలోవ నెహ్రూనగర్(రాజేంద్రనగర్)లోని అంగన్‌వాడీ కేంద్రంలో పలువురు గర్భిణులకు సంప్రదాయ పద్ధతిలో సీమంతాలు చేసి పండ్లు అందజేశారు. ఎటువంటి పౌష్టికాహారం తినాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి గర్భిణులకు అంగన్‌వాడీ సెంటర్ టీచర్లు కామేశ్వరి, అన్నపూర్ణ వివరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది రామలక్ష్మి, పద్మ, లక్ష్మి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.



గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

22న 'ప్రపంచ శాంతి-అభివృద్ధి'పై సదస్సు

ఎంవీపీకాలనీ: ఈ నెల 21న ప్రపంచ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకొని 'ప్రపంచ శాంతి-అభివృద్ధి' అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నారు. ఎంవీపీ కాలనీలోని వీఎంసీ కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ బుల్లయ్య కళాశాల గాంధీ సెంటర్ వేదికగా ఈ నెల 22వ తేదీ ఆదివారం ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఏఎన్‌యూ మాజీ వీసీ ఆచార్య బాలమోహన్‌దాస్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు. సమాజంలో శాంతి స్థాపనను కాంక్షించేవారు, ఆ దిశగా సేవలందించేవారు ఈ సదస్సుకు హాజరవుతారన్నారు. నరవ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జగదీశ్వరరావు తదితరులు

షామియానా సప్లయర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

ఎంవీపీకాలనీ: షామియానా సప్లయర్లను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని విశాఖ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎస్.వి.సుమన్ అన్నారు. ఎంవీపీ కాలనీ బీచ్ రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్‌లో బుధవారం ఫంక్షన్ మెటీరియల్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో షామియానా రంగంలో వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన సమావేశం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ గొలగాని మంగవేణి, ఎస్.వి.సుమన్‌లు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమన్ మాట్లాడుతూ కరోనా వంటి విపత్తులు, భారీ సెట్టింగ్ వ్యాపారం కారణంగా షామియానా సప్లయర్లు వ్యాపారం పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆర్థికంగా నష్టపోవడంతో దివాలా తీస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక భరోసా కల్పించి వారిని ఆదుకోవాలని కోరారు. అసోసియేషన్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కార్పొరేటర్ మంగవేణి పేర్కొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్‌వీ సుబ్బారావు, ఉపాధ్యక్షుడు చిట్టూరి గిరిధర్, కార్యదర్శి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

ఎంవీపీకాలనీ: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వి.రామచందర్‌ను జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యపద్మ మర్యాదపూర్వకంగా కలిశారు. నగర పర్యటనలో భాగంగా రామచందర్ బుధవారం విశాఖ చేరుకున్నారు. ఈ సందర్భంగా విశాఖ రైల్వే స్టేషన్‌లో ఆయనకు ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగులతోపాటు ఈడీ సత్యపద్మ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా చేపడుతున్న కార్యకలాపాలను వివరించారు. ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారని చెప్పారు. భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ కమిషన్ సభ్యుడు రామచందర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ తదితరులు